సాక్షి
తిరుపతి
మంగళవారం । 27 । జూన్ । 2023



అవినీతిని తేల్చుకుందాం రా!
టీడీపీ నాయకుల అవినీతిని, తన అవినీతిని తేల్చుకుందాం రా..? అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సవాల్ విసిరారు. - 8లో



మత్తులో చిత్తవ్వద్దు
యువత మత్తుకు చిత్తవ్వద్దని వక్తలు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	27
చిత్తూరు	36	26
తిరుమల	32	22
గూడూరు	38	29
నగరి	38	27

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జూలై 4వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల పీడీలు తులసి, గంగాభవానీ, రాధమ్మ, నాగ శైలజ, పద్మనాభం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, డీపీఓ లక్ష్మి, ఆర్టీసీ ఆర్ఎం జితేందర్ రెడ్డి, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెలీప్యాడ్ పరిశీలన

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్‌ను ఎస్పీ రిషాంత్‌రెడ్డి పరిశీలించారు.

స్పందనకు 75 ఫిర్యాదులు



ఫిర్యాదును స్వీకరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 75 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

ఉపాధిని సద్వినియోగం చేసుకోండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

చిల్లకూరు: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూడా ప్రభుత్వం ద్వారా అందించే ఉపాధి పనులను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి దేవ్‌సింగ్ సెహ్వాగ్ ఆకాంక్షించారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథంకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. పని జరిగే ప్రదేశంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారని ఆరాతీశారు. పని చేసే ప్రాంతంలో కచ్చితంగా ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఉండేలా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవిలో మజ్జిగ, మంచి నీరు అందించాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు, ఉపాధి ఏపీడీ రవికుమార్ నాయుడు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ గోపీనాథ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అర్జీలకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే అర్జీలతో పాటు జగనన్నకు చెబుదాం అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్ణిత గడువులోపు అర్జీలకు పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. జగనన్న సురక్ష టాస్క్‌ఫోర్స్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అలసత్వం ప్రదర్శించిన వారికి మంగళవారం నాటికి మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రగతి చూపనిపక్షంలో మొదటిసారి షోకాజ్ నోటీసులు, రెండోసారి అలసత్వం వహిస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. అడిషనల్ ఎస్పీ వెంకటరావు, డీఆర్వో కోదండరామిరెడ్డి, తిరుపతి ఆర్డీఓ కనకనరసారెడ్డి, డీఎల్‌డీఓ సుశీలాదేవి, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

'కుప్పం ప్రజలు చంద్రబాబును 35 ఏళ్లుగా గెలిపిస్తున్నారు. మీ అండదండలతోనే ఆయన 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశారు. కానీ తన సొంత నియోజకవర్గానికి కనీసం నీళ్లు కూడా ఇవ్వలేకపోయారు. ఇప్పుడు అవకాశం కావాలని అడుగుతున్నారు. ఇప్పటికైనా కుప్పం ప్రజలు ఆలోచించండి. చంద్రబాబు మోసాన్ని గుర్తించండి. కుప్పంలో వైఎస్సార్‌సీపీకి ఒక్కసారి మద్దతు ఇవ్వండి. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపుతాం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కుప్పం నియోజకవర్గం, రామకుప్పం మండలంలో విస్తృతంగా పర్యటించారు. వివిధ పంచాయతీల్లో జరిగిన సభల్లో చంద్రబాబు మోసాలను ఎండగట్టారు.

ఆలోచించండి..
మద్దతు ఇవ్వండి!



పంద్యాలమడుగు సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- దూరదృష్టితోనే పథకాల రూపకల్పన
- నాలుగేళ్లలో 99 శాతం హామీలు నెరవేర్చాం
- కరోనా కాలంలోనూ నిరాటంకంగా సంక్షేమ పథకాలు
- చంద్రబాబు కుప్పానికి చేసిందేమీ లేదు
- రామకుప్పం పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి

కుప్పం/రామకుప్పం: భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం పల్లెబాట కార్యక్రమంలో భాగంగా రామకుప్పంలోని పంద్యాలమడుగు, గౌరివిమాకులపల్లి, బందార్లపల్లి, ముద్దనపల్లి, మణీంద్రం, సింగసముద్రం, రాజుపేట, చెల్దిగానిపల్లి, కొంగాటం గ్రామాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మాట్లాడారు. విద్యార్థులు, యువతను దృష్టిలో ఉంచుకుని నాడు–నేడు, వైద్యశాలల ఆధునీకరణ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మొదట సచివాలయ వ్యవస్థ తీసుకువస్తే విపక్షాలు లేని పోని రద్దాంతం చేశాయని, కరోనా కాలంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ లేకపోతే మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యేవని గుర్తుచేశారు.

ఇదే తరహాలోనే ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇంగ్లిషు సరళంగా నేర్చుకుని ఉద్యోగాల కోసం బయటి దేశాలకు వెళ్తే వారి కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వ వైద్యశాలల ఆధునీకరించి, వాటికి సరిపడా సిబ్బందిని నియమించడం ద్వారా పేదలచెంతకే వైద్యం వచ్చినట్లయిందని చెప్పారు. ఇందులో భాగంగానే వైద్యరంగంలో 40 వేల పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాల, సూపర్ స్పెషలాలిటీ ఆస్పత్రులు తీసుకువస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా 2,300 జబ్బులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అంతేగాక బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాల్లోని ఆస్పత్రుల్లో కూడా ఉచితంగా చికిత్సలు చేసుకోవచ్చన్నారు.

హామీలు పూర్తిచేసిన తర్వాతే ఎన్నికలకు

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచినట్టు తెలిపారు. హామీలే కాకుండా మరెన్నో పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ఎక్కడ మేనిఫెస్టో మరిచిపోతారో అని తన కార్యాలయంలో ఫొటో తీసి పెట్టుకున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. మంత్రులు కూడా వారివారి కార్యాలయాల్లో మేనిఫెస్టో పెట్టుకునే విధంగా చేశారంటే ఆయన నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. ఇప్పటి వరకు ఇలాంటి నిర్ణయాన్ని ఏ ప్రభుత్వం తీసుకోలేదన్నారు.



బందార్లపల్లి సభకు హాజరైన మహిళలు



వలంటీర్‌కు పురస్కారాన్ని అందిస్తున్న మంత్రి

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోని అనుసరిస్తున్న బాబు

ప్రజల్లో తగ్గుతున్న అభిమాన్ని చంద్రబాబు ఓర్వలేక, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోని అనుకరించే పరిస్థితికి వచ్చాడని మంత్రి పెద్దిరెడ్డి ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం అని చెప్పి.. దాన్ని అమలు చేయకపోగా.. ఇప్పుడు మరలా అదే హామీని ప్రజల ముందుకు తెచ్చి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇదిచాలక తమిళనాడు, కర్ణాటక మేనిఫెస్టోలోని అంశాలను కూడా తీసుకొస్తున్నారని.. ఆయన ఎన్ని జిమ్మిక్కులు చేసినా జనం నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, నాయకులు కొండవీటి నాగభూషణం, వెంకటరెడ్డియాదవ్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, మొగసాల రెడ్డెప్ప, రామకుప్పం ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, కురబ సంఘ నాయకుడు ఆరేళ్ల జయప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'న్యాయం'!

- అట్టహాసంగా వైఎస్సార్ లా నేస్తం
- జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం వెన్నుదన్ను
- పాల్గొన్న డెప్యూటీ సీఎం కే.నారాయణస్వామి

తిరుపతి అర్బన్: 'అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేశాం. జూనియర్ న్యాయవాదులు వృత్తిలో స్థిరపడాలి. వారికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుంది' అని డెప్యూటీ సీఎం కే.నారాయణస్వామి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో హాజరై కంప్యూటర్ బటన్ నొక్కి అర్హులైన జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో నగదు జమచేయగా.. ఆ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి డెప్యూటీ సీఎంతోపాటు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, డీఈఓ వీ.శేఖర్ తదితరులు హాజరై తిలకించారు. అనంతరం డెప్యూటీ సీఎం మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ వారు వృత్తిలో రాణించడానికి 'వైఎస్సార్ లా నేస్తం' దోహదపడుతుందన్నారు. ప్రతి నెలా రూ.5 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తూ వారికి వెన్నుదన్నుగా నిలుస్తోందని చెప్పారు. 2019 నవంబర్ నుంచి వరుసగా మూడో దఫా వైఎస్సార్ లానేస్తం పథకాన్ని అమలు చేసినట్టు తెలిపారు. కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌తో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కలెక్టర్‌తో కలిసి మెగా చెక్కును లబ్ధిదారులకు అందచేశారు.



జూనియర్ న్యాయవాదులకు మెగా చెక్కును అందజేస్తున్న డెప్యూటీ సీఎం, కలెక్టర్

ఆర్థిక భరోసా



నా పేరు స్వర్ణలత. నేను తిరుపతిలో నివసిస్తున్నాను. నేను 2021లో లా కోర్సు పూర్తి చేశాను. 2023లో లానేస్తం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాను. ఈ పథకం జూనియర్ న్యాయవాదుల అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుంది. సీఎం వైఎస్ వైఎస్ జగనన్నకి ధన్యవాదాలు

తల్లిదండ్రులపై ఆధారపడకుండా...



నా పేరు లావణ్య. మాది తిరుపతి. శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో లా పూర్తి చేశాను. నేను ఏడాదిగా లా నేస్తం పథకం ద్వారా నెలకు రూ.5 వేలు పొందుతున్నాను. కుటుంబం మీద ఆధారపడకుండా కోర్సుకు అవసరమైన బుక్స్, జర్నల్స్ కోసం వినియోగించుకుంటున్నాను.

డిసెంబర్ కల్లా
స్మార్ట్‌సిటీ పనులు పూర్తి



స్మార్ట్‌సిటీ పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ఎండీ డీ.హరిత

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను డిసెంబర్ కల్లా పూర్తిచేయాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం స్మార్ట్‌సిటీ అడ్వైజరీ ఫోరం సమావేశం నిర్వహించారు. ముందుగా అడ్వైజరీ ఫోరం అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిసెంబర్ కల్లా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దాదాపు పూర్తి కావస్తున్న శ్రీనివాస సేతు, వినాయక సాగర్, క్రికెట్ స్టేడియం, ఆర్ట్ డిస్ట్రిక్ట్ స్టూడియో తదితర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ఒకట్రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం సమీపం నుంచి పాత తిరుచానూరు రోడ్డుకు వెళ్లేందుకు మంజూరైన ఫుట్‌వోవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. నగరంలో పబ్లిక్ టాయ్‌లెట్స్ నిర్వహణ మెరుగుపడాలని చెప్పారు. మేయర్ శిరీష మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత మాట్లాడుతూ 2016లో స్మార్ట్‌సిటీ మిషన్ ప్రారంభమైందని, రూ.1618 కోట్లతో 97 ప్రాజెక్టులు మంజూరైనట్లు చెప్పారు. ఇందులో రూ.187 కోట్ల విలువైన 60 అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు వెల్లడించారు. రూ.1,431 కోట్లకు సంబంధించిన 37 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ డిసెంబర్ నాటికి పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. టీటీడీ సహకారంతో నిర్మిస్తున్న శ్రీనివాససేతు పనులు 98 శాతం పూర్తయ్యాయన్నారు. డిప్యూటీమేయర్ ముద్రనారాయణ, జనరల్ మేనేజర్ చంద్రమౌళి, ఎస్ఈ మోహన్, కమిటీ సభ్యులు కైలాష్, శ్రీనివాసరావు, మంగాటి గోపాల్‌రెడ్డి, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కే.బాబు, కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్పందన లేని యువగళం

వాకాడు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా నారాలోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రకు జన స్పందన కరువైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం వాకాడులో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో సాగుతున్న యువగళం పాదయాత్రలో అక్కడక్కడా ఏర్పాటు చేస్తున్న సమావేశ సభల్లో తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం తప్ప జన స్పందన లేదన్నారు. ఇరుకు వీధులు, సంధులను ఎంచుకుని, అందులోనే ఇరువైపులా దుకాణాలకు అడ్డంగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పటికీ సభా వేదికలో జనం నిండని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అనంతరం వాకాడు, కోట, చిట్టమూరు మండలాల నాయకులతో సమావేశమయ్యారు.



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఎస్వీ వెటర్నరీ వర్సిటీతో ఒప్పందం

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీవేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీతో ఎస్వీ వైద్య కళాశాల సోమవారం పరస్పరం ఒప్పందం కుదుర్చుకుంది. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ డాక్టర్ వీ.పద్మనాభరెడ్డి, రిజిస్ట్రార్ ఏ.రవి మాట్లాడుతూ ఎస్వీ వైద్య కళాశాల విద్యార్థుల దృష్ట్యా ఆ కళాశాల తమ వర్సిటీతో తొలిసారిగా ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. వెటర్నరీ విద్యార్థులు, ఎస్వీ వైద్య కళాశాల విద్యార్థులకు, పారామెడికల్ విద్యార్థులకు, సైంటిస్ట్, టెక్నాలజిస్ట్‌ల ఉపయోగార్థం ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, ఎక్స్‌ఛేంజ్ ఆఫ్ సైంటిఫిక్ లిటరేచర్, ఇన్‌ఫర్మేషన్ అండ్ మెథడాలజీ, డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ కొలాబరేటివ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ తదితర వాటికి సంబంధించి ఐదేళ్ల కాలపరిమితితో పరస్పర ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపల్(అడ్మిన్) డాక్టర్ వెంకటేశ్వర్లు, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ కిరీటి పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాన్ని చూపుతున్న ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్

ఎర్రచందనం విక్రయానికి అనుమతి

- మొదటి దశలో రూ.178 కోట్లకు 310 టన్నుల అమ్మకం
- రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి

తిరుపతి అర్బన్: తిరుపతి అటవీ గిడ్డంగిలో నిల్వ ఉన్న 5,400 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం విక్రయానికి కేంద్రప్రభుత్వం నుంచి అనుమతులొచ్చాయని రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన తిరుపతి మంగళం సమీపంలోని ఫారెస్ట్ గిడ్డంగి వద్ద విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 5,400 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని విక్రయించడానికి అనుమతులు రావడంతో మొదటి దశలో 310 మెట్రిక్ టన్నులను రూ.178 కోట్లకు చైనా వ్యాపారులకు విక్రయించినట్లు చెప్పారు. మిగిలిన 5,090 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం రెండు, మూడు దశల్లో విక్రయించడానికి టెండర్లు ఆహ్వానించామని తెలిపారు. టాస్క్‌ఫోర్స్, అటవీ సిబ్బంది సమన్వయంతో కలిసి పనిచేస్తున్నారని, అక్రమంగా ఎర్రచందనం తరలిపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.



మాట్లాడుతున్న వై.మధుసూదన్‌రెడ్డి

శేషాచలంలో పెరిగిన వన్యమృగాల సంఖ్య

గతంలో పోలిస్తే అడవి దట్టంగా పెరగడంతో శేషాచలంలోనూ, తిరుమల నడక దారిలోనూ వన్యప్రాణుల సంఖ్య పెరిగిందని మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఏనుగుల సంచారం విషయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పొరుగు రాష్ట్రాలతో కలిసి సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నై–బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే ఈ ప్రాంతం గుండా పోతుందని తెలిపారు. 3.6 కిలోమీటర్ల మేర అటవీ జంతువులు, ఏనుగులు రహదారి దాటేందుకు ఎలివేటెడ్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జూపార్క్ అభివృద్ధికి టీటీడీ రూ.3 కోట్లు కేటాయించిందని చెప్పారు. తిరుపతి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు, తిరుపతి డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి, ఎర్రచందనం గిడ్డంగి ఇన్‌చార్జి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 159 అర్జీలు


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 159 అర్జీలు వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. డీఆర్వో కోదండరామిరెడ్డి, ఎస్‌డీసీలు భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులుతో కలిసి జేసీ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో ఒక్క రెవెన్యూశాఖకే 120 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. మరోవైపు పలువురు పలు సమస్యలపై కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డికి అర్జీలను అందజేశారు.

మత్తులో చిత్తవ్వద్దు


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

- యువత మత్తుకు దూరంగా ఉండాలి
- కలెక్టర్, ఎస్పీ పిలుపు

తిరుపతి క్రైం: మాదకద్రవ్య వ్యతిరేక సమాజ నిర్మాణమే లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్‌ఈబీ) సిబ్బంది ఎస్పీ పీ.పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం రోడ్డులోని ఎస్పీ కార్యాలయం వద్ద ర్యాలీని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ టౌన్‌క్లబ్, బాలాజీ కాలనీ మీదుగా ఎస్వీయూ ఆడిటోరియానికి చేరింది. మాదకద్రవ్యాలను అరికడదాం, మత్తు నుంచి బయటపడదాం అంటూ విద్యార్థుల నినాదాలతో నగరం మార్మోగింది. అనంతరం ఎస్వీయూ ఆడిటోరియంలో జరిగిన అవగాహన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచలోనే ఏదేశంలో లేని యువత ఒక్క మన భారత దేశంలో మాత్రమే ఉందని, అలాంటి యువత మత్తుకు బానిసై నిర్వీర్యం అయితే దేశం ముందుకు వెళ్లలేదని చెప్పారు. ప్రతి ఒక్కరూ మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యువత బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. మత్తు, మాదక ద్రావ్యాల అక్రమరవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేసినా, సేవించినా తమ దృష్టికి తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. డ్రగ్స్ సంబంధిత సమాచారాన్ని 100, 14500 ఎస్‌ఈబీ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారాన్ని అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ నజీర్, అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ స్వాతి, డీఎస్పీలు సురేంద్రరెడ్డి(తిరుపతి), యశ్వంత్ (చంద్రగిరి), నరసప్ప ట్రాఫిక్, సీఐలు, ఎస్‌ఐలు, ఎమ్మెస్కేలు పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,433
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,300
రిటైల్ వెండి గ్రాము	రూ.73.30

చేపలు పట్టేందుకు వెళ్లి.. కానరాని లోకాలకు

ఓజిలి:మండల పరిధిలోని వెంకటరెడ్డిపాళెం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి జట్కాల సువర్ధన్ (42) కాలుజారి చెరువులో పడడంతో మృతి చెందాడు. స్థానికుల వివరాలు.. వెంకటరెడ్డిపాళెం గ్రామానికి చెందిన సువర్ధన్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లగా.. వలవేసేందుకు చెరువులోకి దిగాడు. కాలుజారి లోతు గా ఉన్న గుంతలో పడిపోవడంతో బురదలో కూరుకుపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'పులికాట్'పై లోకేష్ అసత్యప్రచారం

- మత్స్యకారులపై కపట ప్రేమ
- ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి


డాక్టర్ గురుమూర్తి , తిరుపతి ఎంపీ

తిరుపతి తుడా : పులికాట్ సరస్సుపై అవగాహన రాహిత్యంతో నారా లోకేష్ పరుష పదజాలంతో అసత్య ఆరోపణలు నిస్సిగ్గుగా చేశారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎంపీ సోమవారం మీడియాకు ప్రకటనలు విడుదల చేశారు. పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ సూళ్లూరుపేటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డిపై చేసిన విమర్శలు సిగ్గుచేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పులికాట్ సరస్సు ముఖద్వారం పూడిక తీత జరుగుతోందన్నారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పులికాట్ సరస్సు అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇవేమీ తెలియని నారా లోకేష్ తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి రాగానే ఆర్థిక శాఖ అనుమతితో రూ.128 కోట్లతో పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. అక్కడ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి పూడిక తీత పనులను విస్మరించారని నిరాధార ఆరోపణలు చేయడం అతని రాజకీయ పరిపక్వాన్ని తెలియజేస్తుందన్నారు. సముద్రంలో చేపలవేట నిషేధ సమయంలో ఉపాధి కోల్పోయే అర్హులైన మత్స్యకారులకు జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంతో 21-60 సంవత్సరాల వయస్సు కలిగిన 1.32 లక్షల మందికి మత్స్యకార భరోసా ద్వారా రూ.10 వేలు చొప్పున అందజేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మత్స్యకారులకు మేలు చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని చెప్పారు. అధికారం లేనపుడు తెలుగుదేశం పార్టీ నాయకులకు మత్స్యకారులు, పేదలు గుర్తుకు వస్తారనడానికి ఇదొక ఉదాహరణ అన్నారు.

1న విద్యాసంస్థల బంద్


బంద్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతి అర్బన్, రూరల్ పరిధిలోని కార్పొరేట్, ప్రయివైట్ స్కూల్స్‌లో ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు అనధికారికంగా లక్షలాది రూపాయల ఫీజులు వసూళ్లు చేయడాన్ని నిరసిస్తూ జూలై 1వ తేదీన కార్పొరేట్, ప్రైవేటు స్కూల్స్ బంద్ చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హేమాద్రి యాదవ్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్పొరేట్, ప్రయివేటు స్కూల్స్‌లో ఎల్‌కేజీ కోర్సుకే అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు మొత్తం రూ.50వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అనేక సార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.మల్లికార్జున్, జీజేఎస్ ఫౌండర్ ఎం.మహేంద్ర నాయక్, ఏపీఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఎం.ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి షోడశదిన కిష్కింధకాండ పారాయణదీక్ష

తిరుమల: శ్రీవారి అనుగ్రహంతో సృష్టిలోని సకల జీవరాశులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ నెల 30 నుంచి జూలై 15వ తేదీ వరకు తిరుమల వసంత మండపంలో షోడశదిన కిష్కింధకాండ పారాయణ దీక్షను టీటీడీ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి ఈనెల 29వ తేదీ రాత్రి ఏడు గంటలకు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో అంకురార్పణ జరగనుంది. 16 రోజుల పాటు నిష్ణాతులైన వేద పండితులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేపడుతోంది. కిష్కింధకాండలోని సర్గలను పండితులు పారాయణం చేస్తారు. అలాగే ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివసుబ్రమణ్య అవధాని ఆధ్వర్యంలో ధర్మగిరిలో హోమాలు, జపాలు నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల కోసం ఎస్వీబీసీ ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

పంట నిల్వకు ప్రభుత్వ గోదాములు ఉత్తమం


మాట్లాడుతున్న డాక్టర్ శ్యామ్‌కుమార్

తిరుపతి రూరల్: రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వ గోదాముల్లో నిల్వ ఉంచుకోవడంతో విస్తృత ప్రయోజనాలు పొందుతారని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్(ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్ కుమార్ అన్నారు. తిరుపతి రూరల్ మల్లంగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ(పీఏసీఎస్) చైర్మన్ హేమాద్రిరెడ్డి అధ్యక్షతన సోమవారం సొసైటీ కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర లేక, పంటల నిల్వపై అవగాహన కొరవడి విధిలేక మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పడుతున్న కష్టాలను అధ్యయనం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థను ఏర్పాటు చేశాయని, దీంతో గిట్టుబాటు ధర లభించే వరకు ప్రభుత్వ గోదాముల్లో నిల్వ ఉంచుకుని మెరుగైన ధరలు వచ్చిన తర్వాత వాటిని విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. ఈ సదస్సులో జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాసులురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ స్విమ్స్' రద్దు

తిరుపతి తుడా : రోగులు, వారి సహాయకుల సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు చేపట్టిన డయల్ యువర్ స్విమ్స్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో మంగళవారం ఉదయం జరగాల్సిన డయల్ యువర్ స్విమ్స్‌ను రద్దు చేసినట్లు చెప్పారు. తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతుందో స్విమ్స్ యాజమాన్యం త్వరలోనే తెలియజేస్తుందని చెప్పారు.

రాష్ట్ర ఆడిట్ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నూతన కమిటీ


కొలువుదీరిన నూతన కార్యవర్గం

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆడిట్ ఎన్‌జీవోస్ అసోసియేషన్ టీటీడీ యూనిట్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా ఆడిట్ ఆఫీసర్, ఎన్నికల అధికారి లక్ష్మీప్రభావతమ్మ ఆధ్వర్యంలో ఈ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా కె.శివప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడుగా కుమారస్వామితో పాటు 14 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ నూతన కార్యవర్గం టీటీడీలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆడిటర్ల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె.శివప్రసాద్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి నరేంద్ర బాబుతో కలిసి జిల్లా పర్యావరణ ప్రణాళికల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పర్యావరణ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, శబ్ద కాలుష్యం, తాగునీటి వనరుల కాలుష్యం, వాహన కాలుష్యం, ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణ, మైనింగ్, అటవీశాఖ కార్యకలాపాలపై నివేదికలు సిద్ధం చేసి మంగళవారం నాటికి సమర్పించాలని ఆదేశించారు. అటవీశాఖ వారు పాఠశాల ఆవరణలో, ఇంటి ఆవరణలో, చెరువు గట్లపైన మొక్కలు నాటడంపై డ్వామా, హార్టికల్చర్ అధికారులతో సమన్వం చేసుకుని చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నరేంద్రబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీరు విజయకుమార్, జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి సీతారామిరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా గనుల శాఖ అధికారి ప్రకాష్‌కుమార్, తిరుపతి డిప్యూటీ కమిషనర్ చంద్ర మౌళీశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కీచక డ్రైవర్‌కు బడితపూజ

- బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన బస్సు డ్రైవర్
- పోలీసుల అదుపులో నిందితుడు

చంద్రగిరి(తిరుపతి రూరల్): పదో తరగతి బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్ వ్యాన్ డ్రైవర్‌కు ఆ చిన్నారి బంధువులు బడిత పూజ చేసి, పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్లితే.. చంద్రగిరిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఓ బాలిక పదో తరగతి చదువుతోంది. రోజూ స్కూల్‌కు చెందిన బస్సులో బడికి వెళుతుంది. ఆ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న చంద్రగిరి మండలం, దోర్నకంబాలకు చెందిన దివాకర్‌రెడ్డి సదరు బాలికకు మాయ మాటలు చెప్పి, అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఎవరికైనా చెప్పితే చంపేస్తామని బెదిరించేవాడు. అంతేకాకుండా ఫోన్‌లో అసభ్యంగా మెసేజీలు పెట్టేవాడు. డ్రైవర్ వేధింపులను భరించలేకపోయిన ఆ బాలిక, విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. మెసేజీలను చూపించింది. తాను ఆ బస్సులో స్కూల్‌కు వెళ్లనని, ఆ స్కూలే వద్దంటూ కన్నీరు మున్నీరైంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు కోపోద్రిక్తులై స్కూల్‌కు వెళ్లారు. ప్రిన్సిపల్ సురేష్‌ను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆయన నిందితుడిని కాపాడేందుకు ప్రయత్నించాడు. ఆగ్రహం వ్యక్తం చేసిన బాలిక బంధువులు స్కూల్‌పై దాడి చేశారు. డ్రైవర్ దివాకర్‌రెడ్డికి దేహశుద్ధి చేసి, చంద్రగిరి పోలీసులకు అప్పగించారు. బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన దివాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీనిపై పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌ను వివరణ కోరగా తనకు ఎలాంటి సంబంధం లేదని, పాఠశాలలో ఏమీ జరగలేదని, డ్రైవర్‌ని మాత్రం విధుల నుంచి తొలగించామని తెలిపారు. చంద్రగిరి ఎస్ఐ హిమబిందును వివరణ కోరగా దీనిపై ఫిర్యాదు చేయలేదని, ఓరల్‌గా చెప్పారని, అయినా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

అవినీతిని తేల్చుకుందాం రా!

- నారా లోకేష్‌కు కిలివేటి సవాల్


జిలానీ, నస్రీన్‌లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి

నాయుడుపేట టౌన్: 'మీ టీడీపీ నాయకుల అవినీతిని, నా అవినీతిని నువ్వు సభ పెట్టిన ప్రాంతంలోనే తేల్చుకుందాం రా!' అంటూ టీడీపీ నేత నారా లోకేష్‌కు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సవాల్ విసిరారు. నాయుడుపేటలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో నారా లోకేష్ చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరైన పాదయాత్ర అంటే ఉదయం నుంచి గ్రామాల మీదుగా వెళ్తూ.. అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని, యువగళం పాదయాత్ర ఈవినింగ్ వాక్ లాగా సాగుతోందని ఎద్దేవా చేశారు.

మీరా సీఎం జగనన్నను విమర్శిచేది?

'మామను వెన్నుపోటు పొడిచి, ఆయన ఆత్మను క్షోభకు గురిచేశారు. సొంత సోదరుడు నారా రామ్మూర్తినాయుడు, బావమరిది నందమూరి హరికృష్ణ ఆత్మలను సైతం క్షోభకు గురిచేసిన మీరా..! సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేది' అంటూ ఎమ్మెల్యే కిలివేటి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్‌ను విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదన్నారు. దేశ చరిత్రలో ఏ సీఎం చేయని విధంగా ఆయన సూచనల మేరకు ఆయా ప్రాంతాల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియ జేసేలా ఎమ్మెల్యేలు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపడుతున్నారని చెప్పారు. '2019 నుంచి జరిగిన అభివృద్ధిని జీఓలతో సహా వివరిస్తా.. 2014 -2019 వరకు టీడీపీ హయంలో జరిగి అభివృద్ధిని నువ్వు జరిపిన బహిరంగ సభ చోటే చర్చకు సిద్ధమా..?' అంటూ ఎమ్మెల్యే సంజీవయ్య, లోకేష్‌కు సవాల్ విసిరారు. చంద్రబాబు, కరువుతో పాటు నమ్మకద్రోహానికి, మోసానికి, వెన్నుపోటు తనానికి బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పారు. నెల్లూరు ఎన్‌డీడీడీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏసీలో ఉంటూ సాయంత్రం ఈవినింగ్ వాక్ చేస్తున్న లోకేష్ రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కే.దీపిక, మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, వివిధ నాయకులు వెంకటరమణారెడ్డి, కే.రాజారెడ్డి, కే.మాధవరెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, బీ.మల్లికార్జునరెడ్డి, కే.భవానిరెడ్డి, కే.జయరామయ్య, వీ.లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, దారా రవి, జీ.సిద్ధయ్య, కిషోర్‌యాదవ్, సీహెచ్.కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సమక్షంలో టీడీపీకి చెందిన మాజీ కోఆప్షన్ సభ్యురాలు షేక్ నస్రీన్, టీడీపీ నాయకులు స్థానిక టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కింగ్స్‌వే జిలాని, ఆయన అనుచరులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.